DYNAMIC EDITION
# వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 2
సోమవారం, నవంబరు 27, 2023
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రధాని నరేంద్ర మోడీ

తిరుమల: భారత ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో టీటీడీ అధికారులు, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఇస్తికఫాల్ తో స్వాగతం పలకగా ప్రధాని ముందుగా ఆలయ ధ్వజ స్థంభానికి మొక్కిన అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపంలో ప్రధానికి వేద పండితులు ఆశీర్వచనం పలకగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి వారికి తీర్థ ప్రసాదాలను, స్వామి వారి చిత్ర పటాన్ని, టీటీడీ క్యాలెండర్, డైరీ 2024 పంచగవ్యాలను అందచేశారు. అంతకు మునుపు స్వామి వారి వద్ద ప్రధాని గారిని శేష వస్త్రంతో ఆలయ ప్రధాన అర్చకులు సత్కరించారు.





## ఈ ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రజలు పూర్తి సినిమా చూపిస్తారు: మోడీ



కరీంనగర్ (వాయిస్ టుడే): మరో 24 గంటల్లో తెలంగాణ ఎన్నికల ప్రచారం ముగియనుండడంతో పార్టీలు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ అగ్రస్థాయి నేతలు రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం పలుచోట్ల ప్రచారం నిర్వహించారు. కరీంనగర్‌లో బీజేపీ సకలజనుల విజయ సంకల్ప సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రాబోతోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. "ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆట ముగియనుంది. మొదటిసారి తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రాబోతోంది. తెలంగాణ బీజేపీ తొలి సీఎం బీసీయే అవుతారు. చరిత్రలో 16 మహాజనపదాల్లో అస్మక జనపదం ఈ ప్రాంతం. హుజూరాబాద్ ఉపఎన్నికతో కేసీఆర్‌కు ట్రైలర్ చూపించాం. ఈ ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రజలు పూర్తి సినిమా చూపిస్తారు" అని ప్రధాని మోదీ అన్నారు. పీవీ నరసింహారావుని కాంగ్రెస్ పార్టీ ప్రతి అడుగులో అవమానించిందని హస్తం పార్టీపై ఆయన విరుచుకుపడ్డారు. తెలంగాణకు బీఆర్ఎస్, కాంగ్రెస్ సర్కార్లు అవసరం లేదని మోదీ అన్నారు. గ్యారెంటీలను నెరవేర్చే మోదీ సర్కార్ తెలంగాణకు అవసరమని అన్నారు. మోదీ గ్యారెంటీ అంటే అందరికీ ఉచిత వైద్యం అందిస్తామని అన్నారు. మోదీ గ్యారెంటీ అంటే అందరికీ ఆరోగ్యం, మోదీ గ్యారెంటీ అంటే రైతులకు చేయూత అని అన్నారు. ప్రజా సంక్షేమమే బీజేపీ ప్రాధాన్యతని, ఓ వైపు కేసీఆర్ ఉన్నారు.. మరో వైపు మీ సేవకుడు మోదీ ఉన్నాడని ప్రధాని అన్నారు.




## వాళ్లకేమో కదిలించి తెచ్చే జనం..
## మనకేమో కదిలివచ్చిన జనం

### అందోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్

అందోల్ (వాయిస్ టుడే): బీఆర్ఎస్ బహిరంగ సభలకు తండోపతండాలుగా తరలివస్తున్న జనాన్ని చూస్తుంటే సంతోషమేస్తుందని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. వాళ్లకేమో కదిలించి తెచ్చే జనం.. మనకేమో కదిలివచ్చిన జనం.. అది వాళ్లకు మనకు ఉండే తేడా.. అంటూ కేసీఆర్ వ్యాఖ్యానించారు. అందోల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగించారు. చివరి దశకు ఎన్నికల ప్రచారం వచ్చింది. నేను చెప్పిన విషయాలు మజాక్ విషయాలు కాదు. రైతులు, పేదల యొక్క జీవన్మరణ సమస్యలు. కాంగ్రెస్ రాజ్యంలో బాధలు అనుభవించం. ఇప్పుడు మళ్ల ఆ బాధలు కొని తెచ్చుకోవద్దు. ఇందిరమ్మ రాజ్యం తెస్తరట. యెన్కటికి ఒకని తద్దినానికి పిలిస్తే.. ప్రతిరోజు మీ ఇంట్ల ఇట్లనే జరగాలని దీవెన పెట్టిండంట.. ఇప్పుడు ఇందిరమ్మ రాజ్యం అంటే ఎవరికి కావాలి ఇందిరమ్మ రాజ్యం నాకు అర్థం కాదు. ఆ ముక్కిపోయిన, ములిగిపోయిన, మందిని చావగొట్టిన ఆకలి రాజ్యం కావాల్నా..? బ్రహ్మాండంగా రెండు, మూడు పంటలు పండిచి, మన నీళ్లు, మన గాలి మనకు దక్కి, మన కరెంట్ మనకు దక్కి దర్జాగా బతికేటటువంటి రాజ్యం కావాల్నా..? దయచేసి ఆలోచించండి.. ఆషామాషీగా తీసుకోవద్దు. మనం గెలిచిపోతున్నాం అనే గర్వం పనికిరాదు. ఈ జనసమూహాన్ని చూసిన తర్వాత అందోల్‌లో గులాబీ జెండా ఎగిరిపోయిందని అర్థమవుతుంది. వాళ్లకేమో కదిలించి తెచ్చే జనం.. మీరేమో కదిలి వచ్చిన జనం. అది వాళ్లకు మనకు ఉండే తేడా.. అక్కడ్నే అర్థమవుతుంది గెలుపు అని పేర్కొంటూ కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.



## రేపటిలోగా రైతు బంధు పడకపోతే..!

హైదరాబాద్: రైతు బంధు ఆన్ గోయింగ్ స్కీమ్.. అలాంటిది ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఎలా ఆపుతారని బీఆర్ఎస్ ఎంపీ కేశవరావు ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. రైతుబంధు అనుమతి ఉపసంహరణ నేపథ్యంలో సీఈవో వికాస్‌రాజ్‌ను బీఆర్ఎస్ ప్రతినిధి బృందం కలిసింది. రైతు బంధకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కేశవరావు మీడియాతో మాట్లాడారు. "రైతు బంధు అనుమతి ఉపసంహరణపై సీఈవో వికాస్ రాజ్‌ను కలిశాం. రైతు బంధుపై మంత్రులు మాట్లాడితే వాళ్లకు నోటీసులు ఇవ్వండి. రైతు బంధును ఎలా ఆపుతారు. రాజకీయ నేతల్లో ఉన్న కోపతాపాలను రైతుల మీద రుద్దకూడదు. రైతు బంధును కాంగ్రెస్ వాళ్లు ఆపారని నేను అనడం లేదు. కేంద్ర ఎన్నికల సంఘంతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నాం. కోర్టుకు వెళ్లేందుకు టైమ్ లేదు. రేపటి వరకు ప్రయత్నం చేస్తాం. లేదంటే రైతులు అర్థం చేసుకోవాలి.. రెండు, మూడు రోజులు ఓపిక పెట్టాలి." అని కోరారు.



## ఫేక్ లేఖతో సోషల్ మీడియాలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం

హైదరాబాద్: రైతుబంధు విషయంలో తనపై బీఆర్ఎస్ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తోందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. రైతుబంధుపై సీఈసీకి పీసీసీ అధ్యక్షుడి హోదాలో తాను రాసినట్లు.. ఫేక్ లేఖను సృష్టించి బీఆర్ఎస్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఓటమి భయంతో బీఆర్ఎస్ దిగజారి ఫేక్ ప్రచారాలు చేస్తోందన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్న బీఆర్ఎస్‌పై చర్యలు తీసుకోవాలని సీఈసీ, ఎస్ఈసీ వికాస్‌రాజ్, డీపీని కోరుతున్నామని రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారు.

## కాంగ్రెస్‌తో కేసీఆర్ కుమ్మక్కయ్యారు

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీతో సీఎం కేసీఆర్ కుమ్మక్కయ్యారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. సోమవారం నాడు మంచిర్యాల రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... ఈ ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదించాలని.. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే కేసీఆర్‌కు వేసినట్టేనని అన్నారు. 2014, 2018 ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ కొనేశాడని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో మళ్లీ గెలిస్తే మళ్లీ కేసీఆర్ కొనేస్తాడని అన్నారు. కేసీఆర్‌ను గెలిపిస్తే రాహుల్ బాబాను ప్రధానిని చేస్తాడని అమిత్ షా ఎద్దేవ చేశారు. కేసీఆర్ ఎన్ని ప్రయత్నాలు చేసినా రాహుల్ ప్రభుత్వం రాదని చెప్పారు. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీకి భయపడే కేసీఆర్ హైదరాబాద్ విమోచనదినోత్సవం జరపడం లేదన్నారు.కేసీఆర్, కాంగ్రెస్‌లు ఓవైసీ కి భయపడుతున్నారని దెప్పిపోడిశారు. ముస్లింలకు ఇచ్చిన 4శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తామన్నారు. మాదిగల సంక్షేమం కోసం ఎస్సీ వర్గీకరణ చేయబోతున్నామని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ పార్టీ బీసీని ముఖ్యమంత్రి చేస్తుందన్నారు. బీజేపీని ఈ ఎన్నికల్లో గెలిపిస్తే సింగరేణి కార్మికులకు ఆదాయపన్ను మాఫీ చేస్తామని అమిత్ షా ప్రకటించారు.








## రైతుబంధు రాకుండా మోదీ, రేవంత్ ఆపారు

కరీంనగర్: రైతుబంధు రాకుండా ప్రధాని మోదీ , టీపీసీసీ చీఫ్ రేవంత్ ఆపారని మంత్రి కేటీఆర్ విమర్శలు గుప్పించారు. హుజురాబాద్‌లో మంత్రి మాట్లాడుతూ... ప్రధాన మంత్రి మోడీకి రేవంత్ చెప్తే.. మోడీ ఎన్నికల కమిషన్‌కు ఫోన్ చేశారన్నారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి రైతులకు రైతుబంధు రాకుండా చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంట్ కోసం కష్టపడ్డ రోజులు గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. పాత చీకటి రోజులు మళ్ళీ రావాలా అని ప్రశ్నించారు. తెలంగాణలో పేద రైతులకు మూడు ఎకరాల కంటే ఎక్కువ భూమి లేదని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రైతుబంధు రైతుబంధుపై కాంగ్రెస్ వక్రబుద్ధి బయటపడింది. కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు. ధరణిని రద్దుచేసి పట్వారీ వ్యవస్థ మళ్లీ తెస్తామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ఓటు వేసే ముందు గ్యాస్ సిలిండర్‌కు మొక్కాలని 2014లో మోదీ అన్నారు. గెలిన తర్వాత రూ.400గా సిలిండర్ ధరను రూ.1200కు పెంచారు. కేసీఆర్‌ను మళ్లీ గెలిపిస్తే రూ.400కే సిలిండర్ ఇస్తాం.' అని మంత్రి కేటీఆర్ అన్నారు.

## బీఆర్ఎస్ మళ్లీ గెలిస్తే భూములు లాక్కుంటారు

యాదాద్రి భువనగిరి (వాయిస్ టుడే): బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే భూ మాఫియా చేస్తారని ప్రియాంకగాంధీ ఆరోపించారు. ఎన్నకల ప్రచారంలో భాగంగా ఆమె ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. "పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజా సమస్యలు, ఉద్యోగాలు, ధరల పెరుగుదలపై పట్టించుకోలేదు. తెలంగాణలోని పెద్ద నేతలు ఫామ్ హౌస్‌లో ఉంటూ విలాస జీవితాన్ని గడుపుతున్నారు. భువనగిరి ఎమ్మెల్యే ప్రజా సమస్యలపై ఎన్నడు నోరు మెదపలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం పైనుంచి కింది వరకు అంతా అవినీతిమయం. తెలంగాణలో బీఆర్ఎస్ నేతలు ధనవంతులు, ప్రజలు మాత్రం పేదలు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగాలు రావు.. ధరణి పేరుతో ఉన్న భూమిని గుంజుకుంటారు. తెలంగాణ అప్పులు ఇంకా పదిరెట్లు పెరుగుతాయి." అని ప్రియాంక విమర్శించారు.

# కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తాం



మధిర (వాయిస్ టుడే): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన తర్వాత ఆరుగ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని సీఎల్పీ నేత, మధిర కాంగ్రెస్ అభ్యర్థి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. సోమవారం నాడు కార్తీక పౌర్ణమి రోజున బోనకల్ మండలం, చొప్పకట్లపాలెం ఆంజనేయస్వామి దేవాలయంలో 6 గ్యారెంటీలు అమలు చేస్తామని నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చిన ఆఫిడవిట్ పైన సంతకం చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో గెలిచిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేస్తాను. నియోజకవర్గ అభివృద్ధి కోసమే పూర్తిగా అంకితం అవుతాను. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని భట్టి విక్రమార్క చెప్పారు.

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుతానని చెప్పారు. నిజాయితీగా నా బాధ్యతలు నిర్వహిస్తానన్నారు. అవినీతికి ఏమాత్రం తావు లేకుండా పారదర్శకంగా పనిచేస్తూ తెలంగాణ ప్రగతి కోసం కృషి చేస్తానని అన్నారు. మధిర నియోజకవర్గ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, పైన పేర్కొన్న విషయాలన్నింటికీ సదా కట్టుబడి ఉంటానని ఆఫిడవిట్‌తో దేవుడి సాక్షిగా భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు.



## రైతుబంధు రాకపోవడానికి కారణమైన బీఆర్ఎస్ నేతలను తరిమికొట్టండి

మహబూబాబాద్: రైతుబంధు రైతుల ఖాతాలో వేయాలని ఈసీకి తాము విజ్ఞప్తి చేశామని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి తెలిపారు. డోర్నకల్ కాంగ్రెస్ విజయభేరీ సభలో ఆయన మాట్లాడుతూ... ఈసీ అనుమతి ఇచ్చినా.. హరీష్ రావు నోటిదూల, కేసీఆర్ అతి తెలివి వల్ల... రైతు బంధు ఆగిందన్నారు. రైతుల ఖాతాల్లో పడాల్సిన రూ.5వేల కోట్లు ఆగిపోయాయని రేవంత్ పేర్కొన్నారు. రైతుబంధు రాకపోవడానికి కారణమైన బీఆర్ఎస్ నేతలను తరిమికొట్టాలని రైతులకు రేవంత్ విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ కుట్ర వల్లే రైతుల ఖాతాలో పడాల్సిన నిధులు ఆగిపోయాయన్నారు. అల్లుడు హరీష్ వల్లే రూ.5వేల కోట్లు ఆగిపోయాయని... దీనికి కేసీఆర్ సమాధానం చెప్పాలని రేవంత్ అన్నారు. నవంబర్ 30 న అల్లుడు హరీష్ కు.. మామ కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో రైతులకు ఏటా ప్రతీ ఎకరాకు రూ.15వేలు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్‌దని రేవంత్ పేర్కొన్నారు.




## రైతుబంధు గురించి ఆ మాట చెప్పా.. తప్పేముంది?

హైదరాబాద్ : రైతుబంధుకు ఇచ్చిన అనుమతిని ఈసీ వెనక్కు తీసుకోవడం వెనుక హరీష్ రావు ఉన్నారని.. ఆయన వ్యాఖ్యలను బేస్ చేసుకునే ఈసీకి ఫిర్యాదులు వెళ్లాయని సమాచారం. రైతుబంధును ఫలానా టైమ్‌కి వేస్తామని హరీష్ చెప్పారని ఆయన వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకున్న ఈసీ.. రైతుబంధును నిరాకరించిందని తెలుస్తోంది. దీనిపై హరీష్ క్లారిటీ ఇచ్చారు. రైతుబంధుకు ఈసీ అనుమతి ఇచ్చిందని చెప్పానని.. అందులో తప్పేముందని ప్రశ్నించారు. నోటి దగ్గరి ముద్దను కాంగ్రెస్ అడ్డుకుంటోందన్నారు. ఓట్ల కోసం తాము రైతుబంధు తేలేదన్నారు. తెలంగాణ రైతులతో కేసీఆర్‌ది పేగుబంధం అన్నారు. కాంగ్రెస్ నేతలవన్నీ ఝూటా మాటలని హరీష్‌రావు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ హామీలను నెరవేర్చారన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చేలేదన్నారు. యాసంగి పంటకు రైతుబంధు ఇవ్వొద్దని కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారని హరీష్ రావు పేర్కొన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ సునామీ రాబోతుంది



ఖమ్మం: తెలంగాణ లో కాంగ్రెస్ సునామీ రాబోతుందని ఆ పార్టీ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం 20వ డివిజన్‌లో తుమ్మల రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 80 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించ బోతుందన్నారు. ఖమ్మంలో నలభై నుంచి యాభై వేల మెజార్టీతో కాంగ్రెస్ జెండా ఎగరనుందని స్పష్టం చేశారు. నోట్ల కట్టలతో గెలవాలనుకునే వారు ప్రజా బలం ముందు ఓడి పోవాల్సిందే అని తెలిపారు. అవినీతి సొమ్ముతో అధికార మదంతో ఖమ్మం లో తిరుగుతున్నారని మండిపడ్డారు. అరాచక అవినీతి పాలన తరమి కొట్టాలన్నారు. భూ కబ్జాలు లేని ప్రశాంతమైన ఖమ్మం కోసం కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని తుమ్మల పిలుపునిచ్చారు.

## ఆ మంత్రి వల్లే రైతుబంధు ఆగింది



హైదరాబాద్: బీఆర్ఎస్, మంత్రి హరీష్‌రావు బాధ్యతారహితంగా వ్యవహరించడం వల్లే రైతుబంధు ఆగిందని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యలు చేశారు. రైతుబంధు నిలిచిపోవడంతో కేసీ వేణుగోపాల్ ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. రైతుబంధు రైతుల హక్కన్నారు. హరీష్ రావు భాధ్యతారహిత ప్రకటన ఎందుకు చేయవలసి వచ్చిందని ప్రశ్నించారు. కేసీఆర్ ఆదేశాలనే హరీష్‌రావు అమలు చేస్తున్నారని ఆరోపించారు. వారిద్దరి సంకుచిత భావం వల్ల.. రైతు బంధు నిలిచిందన్నారు. ఈ పాపానికి బీఆర్ఎస్ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిస్తూ కేసీ వేణుగోపాల్ ట్వీట్ చేశారు.

## అవినీతిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ బొమ్మాబొరుసు లాంటివి



అవినీతిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ బొమ్మాబొరుసు లాంటివని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఘాటుగా విమర్శించారు. భూమి, సముద్రం, ఆకాశంలో అన్నింటా కాంగ్రెస్ అవినీతికి పాల్పడిందని మండిపడ్డారు. తెలంగాణ ఎన్నికల ప్రచారంలో భాగంగా జేపీ నడ్డా నిజామాబాద్ జిల్లా బోధన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై ఆయన నిప్పులు చెరిగారు. కేసీఆర్ దళిత వ్యతిరేకి అని నడ్డా ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వస్తే మళ్ళీ రాష్ట్రంలో అవినీతి రాజ్యం ఏలుతుందన్నారు. మోడీ హయాంలోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. వచ్చే రెండేళ్లలో ప్రపంచంలో మూడో ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగుతుందన్నారు జేపీ నడ్డా.



## తెలంగాణలో అవినీతి ప్రభుత్వం రాజ్యమేలుతోంది

సిద్దిపేట జిల్లా: గత 10 సంవత్సరాల నుంచి తెలంగాణలో అవినీతి ప్రభుత్వం నడుస్తుందని కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సిద్దిపేట బీజేపీ అభ్యర్థి దూది శ్రీకాంత్ రెడ్డికి మద్దతుగా కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడారు. "రాష్ట్రంలో ఉద్యోగాలు రాక.. యువత ఆందోళన చెందుతుంది. లక్ష ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్.. ఉద్యోగాలు ఇచ్చారా?, దళితబంధు పథకం కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే ఇస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించడంలో కేసీఆర్ విఫలమయ్యారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ వల్లనే తెలంగాణకు విముక్తి లభించింది. నేటి రజాకార్లైన బీఆర్ఎస్, కాంగ్రెస్ వాళ్ల నుంచి విముక్తి రావాలి." అని ఆకాంక్షించారు.

"తెలంగాణ రాష్ట్రంకు కేంద్ర ప్రభుత్వం 9 లక్షల కోట్ల రూపాయులు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు సబ్సిడీ ఇస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తుంది. డిగ్రీ చదివే విద్యార్థులకు ల్యాప్ టాప్ అందిస్తాం. బీబీనగర్ ఎయిమ్స్ తెలంగాణకు మంజూరు చేశాం.. సమ్మక్క సారక్క ట్రైబల్ యూనివర్సిటీ మంజూరు చేశాం. తెలంగాణ రాష్ట్రాన్ని దొచుకునేందుకు ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కేసీఆర్ కూతురు ఉంది.. ఇప్పటికే ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి జైల్లో ఉన్నారు. ఓ వైపు కేసీఆర్.. మరో వైపు హరీష్‌రావు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు." అని ధ్వజమెత్తారు.

### దూది శ్రీకాంత్ రెడ్డి కామెంట్స్..

"తొమ్మిదేళ్ల నుంచి ఒక్క రేషన్ కార్డు ఇవ్వని దుర్మార్గపు ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం. కేసీఆర్ ఇంట్లో నుంచి ఎవ్వరికీ పింఛన్ల ఇవ్వడం లేదు. నల్లా బిల్లులు, కరెంట్ బిల్లులు అడ్డగోలుగా పెంచారు. సిద్దిపేట కౌన్సిలర్లు రాబందులుగా మారారు. కొలువుల కోసం కొట్లాడి తెలంగాణ తెచ్చుకుంటే నేడు ఉద్యోగాల కోసం కొట్లాడాల్సిన పరిస్థితి వచ్చింది." అని దూది శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు.

## రైతు బంధును కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్నది: అసదుద్దీన్ ఓవైసీ



హైదరాబాద్: రైత బంధు స్కీమ్ కింద రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జరిగే నగదు బదిలీని ఎన్నికల సంఘం నిలిపివేసిన విషయం తెలిసిందే. అయితే ఆ స్కీమ్ కింద డబ్బులు రైతులకు చేరకుండా కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్నదని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. రైతు బంధును కాంగ్రెస్ అడ్డుకున్నదని, ఆ స్కీమ్ చాలా ఏళ్ల నుంచి అమలులో ఉందని, ఇప్పటికే అమలులో ఉన్న స్కీమ్‌ను ఎందుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందని ఎంపీ అసద్ ప్రశ్నించారు. ఒకవేళ ఇది కొత్త స్కీమ్ అయి ఉంటే, అప్పుడు దాని గురించి భిన్నంగా ఆలోచించే అవకాశం ఉంటుందని, ఇదేమీ కొత్త స్కీమ్ కాదు అని, అకస్మాత్తుగా ఆ స్కీమ్‌ను అడ్డుకోవడం అంటే, రైతుల పట్ల కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగా ఉందని స్పష్టమవుతోందని అసదుద్దీన్ అన్నారు. రైతు బంధును అడ్డుకోవడం అంటే .. కాంగ్రెస్ పార్టీ తప్పుడు సంకేతాలు పంపుతున్నట్లు తెలుస్తోందని అసద్ ఆరోపించారు.

## మామూ (కేసీఆర్)ను హ్యాట్రిక్ సీఎం చేయాలని మా అభ్యర్థి బరిలో లేని దగ్గరే చెప్తున్నం: అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 'ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తేహదుల్ ముస్లిమీన్' బహిరంగంగా మద్దతిస్తున్నట్లు కనిపిస్తుందిగా అన్ని మీడియా ప్రతినిధి ప్రశ్నకు ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. తమ పార్టీ నుంచి బీఆర్ఎస్‌కు బహిరంగ మద్దతేమీ లేదని, అయితే.. తమ అభ్యర్థులు బరిలో లేని దగ్గర మామూ (కేసీఆర్)ను హ్యాట్రిక్ సీఎం చేయాలని చెబుతున్నామని ఆయన తెలిపారు.

'అలాంటిదేమీ లేదు. మాపై తొమ్మిది అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఎక్కడైతే తమ అభ్యర్థులు పోటీలో లేరో అక్కడ మాత్రమే మేం మమూ (కేసీఆర్)ను హ్యాట్రిక్ సీఎంను చేయాలని ప్రజలను కోరుతున్నాం. కాబట్టి, మేం వాళ్లపై పోటీ చేస్తున్నాం, వాళ్లు మాపై పోటీ చేస్తున్నారు.. అంతేతప్ప బీఆర్ఎస్‌కు మా బహిరంగ మద్దతేమీ లేదు' అని అసదుద్దీన్ చెప్పారు.

## సీఈఓ వికాస్‌రాజ్‌ని కలిసిన తెలంగాణ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు




హైదరాబాద్: సీఈఓ వికాస్‌రాజ్‌ని తెలంగాణ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కలిశారు. సోమవారం నాడు వికాస్‌రాజ్‌ని కలిసిన వారిలో ఎస్టీయూ ప్రెసిడెంట్ సదానందంగౌడ్ , పీఆర్టీయూ తెలంగాణ ప్రెసిడెంట్ చెన్నయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న దాదాపు లక్ష మంది ఉపాధ్యాయులకు సరిగ్గా పోస్టల్ బ్యాలెట్ అందలేదని తెలిపారు. కేవలం 50 శాతం వరకు మాత్రమే ఓటు హక్కు వినియోగానికి మాత్రమే పోస్టల్ బ్యాలెట్ అందాయని.. మిగతా వారికి పోస్టల్ బ్యాలెట్ అందలేదని చెప్పారు. మెదక్, నల్గొండతో పాటు చాలా చోట్ల పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల విధులకు హాజరవుతున్న ఉపాధ్యాయులకు అందలేదన్నారు. ఓటు విలువ తెలిపే మాకే ఓటు వేసే అవకాశం ఇవ్వడం లేదన్నారు. 28వ తేదీ వరకు అందరికీ పోస్టల్ బ్యాలెట్ అందిచి ఓటు వేసే అవకాశం కల్పిస్తామని సీఈఓ హామీ ఇచ్చారు. ఓటింగ్ రోజు సమస్యాత్మక ప్రాంతాలల్లో డ్యూటీ చేస్తాం.. కాబట్టి ఇందులో మహిళలు ఉన్నారు కనుక తర్వాత రోజు సెలవ్ ఇవ్వాలని సీఈఓని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కోరారు.

## ఓటు అనే ఆయుధంతో కల్వకుంట్ల కుటుంబాన్ని తరమికొట్టాలి



భద్రాద్రి కొత్తగూడెం: దొంగల పార్టీ బీఆర్ఎస్ మూడో సారి ముఖ్యమంత్రి కావాలని కలలుకంటున్నారని కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కోరం కన్నకయ్య ఎన్నికల ప్రచారంలో భాగంగా జగదాంబ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో పొంగులేటి మాట్లాడుతూ.. ఓటు అనే ఆయుధంతో కల్వకుంట్ల కుటుంబాన్ని తరమి కొట్టి ఇందిరమ్మ రాజ్యం రావాలన్నారు. దోచుకోవడానికి తెలంగాణ ఇవ్వలేదని.. అమరుల త్యాగం నెరవేరాలంటే కాంగ్రెస్ పాలన తోనే అని స్పష్టం చేశారు. ధనిక తెలంగాణ అప్పుల తెలంగాణగా మార్చారన్నారు. ఇల్లందు అంటే సింగరేణి పుట్టినిల్లు... బోగుట్టగా ప్రసిద్ధి చెందిందన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణిని ప్రైవేట్‌పరం చేయాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణి కార్మికులకు ఇన్‌కమ్ టాక్స్ లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వంలో చేస్తామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన వారికి పోడు భూములు అందజేస్తామన్నారు. బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు సోనియా గాంధీ ఆదేశాలతో అమలు చేస్తామన్నారు. డిసెంబర్ 9న కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేస్తారని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

## రైతుబంధును కాంగ్రెస్ వెంటపడి ఆపించింది



నిజామాబాద్: రైతు బంధును కాంగ్రెస్ వెంటపడి ఆపించిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. రైతుబంధు ఎన్నికల కోసం తెచ్చింది కాదని, కాంగ్రెస్‌కు అంత అభద్రత ఎందుకని ఆమె ప్రశ్నించారు. రైతులు బీఆర్ఎస్ వైపు ఉన్నారనే భయంతోనే రైతు బంధుపై కాంగ్రెస్ ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఫిర్యాదు చేసి రైతు బంధును, రైతు రుణమాఫీని ఆపిందన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేకతను చాటుకుందని అన్నారు. నోటి కాడి బుక్కను లాక్కున్నారు కాబట్టి రైతులు ఆలోచించి ఓటు వేయాలని కవిత అభ్యర్థించారు. తమ శతృత్వమంతా బీజేపీతోనేనని, కాంగ్రెస్ పార్టీ గూండాల ప్రభుత్వాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోందని కవిత విమర్శించారు. సింగరేణి ప్రైవేటీకరణ అని అంటున్న ప్రియాంక గాంధీ వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. సింగరేణిని ప్రైవేట్‌కు అప్పగించింది కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వంలో పెద్ద పెద్ద వాళ్ళే బాగుపడ్డారన్నారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 10 లక్షల ఉద్యోగాల్లో ఇంతవరకూ కేంద్రం నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. యువత అడగాలన్నారు. మతం పేరుతో మంట పెట్టాలి అని ఒక పార్టీ చూస్తుంటే.. కులం పేరుతో చిచ్చు పెట్టాలని మరో పార్టీ చూస్తోందని కవిత విమర్శించారు. "మంచోల్లు కావాలా ముంచే వాళ్లు కావాలా? ఇరిగేషన్ కావాలా మైగ్రేషన్ కావాలా? 24 గంటల కరెంటు కావాలా? 3 గంటల కరెంట్ కావాలా?" అని కవిత ప్రశ్నించారు.